దిగుబడిరాక రైతుల దిగాలు

- వాతావరణం అనుకూలించక తగ్గిన కంది దిగుబడి
- మంచు ప్రభావంతో రాలిన పూత, పిందె
- మద్దతు ధర చెల్లించి ఆదుకోవాలని రైతుల వేడుకోలు

నాగారం : ఆరుగాలం కష్టించి సాగుచేసిన కందిపంట దిగుబడి రాకపోవడంతో రైతన్నలు నష్టాలను చవిచూస్తున్నారు. ఈ ఏడాది యాసంగిలో సాగు చేసిన కందిపంట ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని భావించిన రైతన్నలకు వర్షాభావ పరిస్థితులతో పాటు, వాతావరణ పరిస్థితులు, చీడపీడల వ్యాప్తి, మంచు ప్రభావం రైతులను తీవ్రంగా దెబ్బ తీశాయి. దీంతో సాగుచేసిన పంట పూర్తిగా దెబ్బ తిని దిగుబడి తగ్గిపోయింది.మండలంలో రైతులు ఈఏడాది 1,584 ఎకరాల్లో కంది పంటను సాగుచేశారు. వేల రూపాయాలు వెచ్చించి చీడపీడలు సోకకుండా కందిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టారు. మొదట్లో కందిచేళ్లు ఏపుగా పెరగడంతో మంచి దిగుబడి వస్తుందని రైతులు ఆశించారు. కానీ కంది పంట పూత, కాతదశలో వాతావరణ పరిస్థితులు


ఈటూరులో కందిపంటను నూర్పిడి చేస్తున్న రైతులు

అనుకూలించక మంచు ప్రభావంతో పూత, పిందె రాలి పంట దిగుబడి పూర్తిగా తగ్గిపోయింది.

నామమాత్రంగా దిగుబడి..

కందిపంట పూత, పిందె దశలో వర్షాలు కురవకపోవడం, మంచు ప్రభావంతో పూత రాలిపోయింది. నీటిసౌకర్యం ఉండి, వాతావరణం అనుకూలించి, వర్షాలు సమృద్ధిగా కురిస్తే కంది ఎకరాకు 5క్వింటాల వరకు దిగుబడి వస్తుంది. కానీ ప్రస్తుతం వాతావరణ పరిస్థితులతో ఎకరాకు 2క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చే పరిస్థితి కనిపిస్తుందని రైతన్నలు వాపోతున్నారు. రైతులు కందిసాగు ఒక్కో ఎకరాకు రూ.5వేలు పెట్టుబడి పెట్టి పంటను సాగుచేశారు. ఎకరాకు కేవలం 2నుంచి 3క్వింటాలు మాత్రమే దిగుబడి వస్తుండటంతో రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కన్పించడం లేదు. దీనికి తోడు కందిచేను నరకడం, కందికాయ కొట్టడం, కూలీల ఖర్చు, శ్రమఅంతా వృథా అయ్యిందని పలువురు రైతులు వాపోతున్నారు.

మంచుతో పూతరాలింది



ఈ ఏడాది వానాకాలంలో 4ఎకరాల్లో కందిపంటను సాగుచేశాను. ఒక్కో ఎకరాకు రూ.6వేల చొప్పున పెట్టుబడి పెట్టాను. కంది పూత, పిందె దశలో మంచు ప్రభావంతో పూత రాలి కాతరాక దిగుబడి తగ్గింది. ప్రస్తుతం కంది పంట దిగుబడి ఎకరాకు కేవలం 2క్వింటాలు మాత్రమే వచ్చేలా ఉంది. ప్రభుత్వం ఈ ఏడాది కందికి కనీస మద్దతు ధర చెల్లించి రైతులను ఆదుకోవాలి.

– కేసిడి రాంరెడ్డి, రైతు, గోపాలపురం

దళిత బంధుపై పూర్తి విచారణ జరిపిస్తాం

- తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి (తుంగతుర్తి) : దళిత బంధు పథకాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన తిరుమలగిరి మండలంలో లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలపై పూర్తి విచారణ జరిపించి లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తానని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తిరుమలగిరి మండలంలో దళిత బంధుకు రూ.230కోట్లు కేటాయించగా అందులో దళారులు ప్రవేశించి కోట్ల రూపాయలు కొల్లగొట్టారని, లబ్ధిదారులకు సగం డబ్బులు కూడా ఇవ్వలేదన్నారు. జీఎస్టీ పేరుతో కూడా ఏజెన్సీ నిర్వాహకులు ప్రభుత్వానికి డబ్బులు ఎగ్గొట్టారని, దీనిపై పూర్తి విచారణ జరిపి ఈనెల 30వ తేదీలోపు తుది నివేదిక ఇవ్వాలని ఎస్సీ కార్పొరేషన్ ఏడీ శిరీషను ఆదేశించారు. తిరుమలగిరి మండలంలో 2021 నుంచి 2023వ వరకు జరిగిన ధాన్యం కొనుగోళ్లలో పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని, దీనిపై కూడా పూర్తి విచారణ జరిపించాలని సూచించారు. మండల



మండల సర్వసభ్యలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని, అదే విధంగా పాఠశాలలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కోరారు. సమావేశంలో జెడ్పీటీసీ దూపటి అంజలి, వైస్ ఎంపీపీ బొడ్డు సుజాత, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, తహసీల్దార్ రమణారెడ్డి, ఎంపీడీఓ ఉమేష్‌చారి, మండల పంచాయతీ అధికారి మారయ్య, విద్యాధికారి ఐ.శాంతయ్య, వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఉర్సు

సూర్యాపేట రూరల్ : మండలంలోని కాసరబాద గ్రామశివారులో గల హజ్రత్ సయ్యద్ జాన్‌పాక్ షాయిద్‌షా, మోహిన్‌షా (దంతాల దర్గా) ఉర్సు నేటి నుంచి ఈనెల 28వతేదీ వరకు నిర్వహించనున్నారు. దంతాల కుటుంబం నుంచి దర్గాకు గంధం రాకతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. సంతానం లేని వారు దర్గాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తే సంతానం కలుగుతుందని పరిసర ప్రాంత ప్రజల నమ్మకం. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించడంతో సంతాన దర్గా విరాజిల్లుతుంది. నేడు మండల ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

భానుపురి (సూర్యాపేట) : పట్టణంలో వడ్డెర మట్టి పనివారల సంఘం సమావేశాన్ని ఆ సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సంఘం సూర్యాపేట డివిజన్ నూతన కమిటీని మాజీ అధ్యక్షుడు కుంచం వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా శివరాత్రి విజయ్, ఉపాధ్యక్షుడిగా బొంత శీను, ప్రధాన కార్యదర్శిగా గుంజ రాజు, కోశాధికారిగా గుంజ చిన రాజు, గౌరవ అధ్యక్షుడిగా కుంచం వెంకన్న, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సూర వెంకన్న, సహాయ కార్యదర్శులుగా కుంచం రమేష్, శివరాత్రి శ్రీను, శివరాత్రి లింగయ్య, కొడదల బాలరాజును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కుంచం సురేష్, శివరాత్రి సాయి, రమేష్, శివరాత్రి రేణుబాబు, భిక్షం, వెంకన్న, శంకర్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్పూరి ఠాకూర్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

తిరుమలగిరి (తుంగతుర్తి) : మండల కేంద్రంలో నాయిబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భారతరత్న కర్పూరి ఠాకూర్ 100వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జ్యోతిరావు పూలే అధ్యయన వేదిక అధ్యక్షుడు కొత్తగట్టు మల్లయ్య, సీహెచ్.శ్రీనివాస్, యాదగిరి, సైదులు, సోమయ్య, రాజు, రమేష్, రామ్మూర్తి, ఎల్లయ్య, బుచ్చిబాబు, యాకయ్య, రవి, రాజు, కడెం లింగయ్య పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు


వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

తిరుమలగిరి : గణతంత్ర వేడుకలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం గణతంత్ర భారతదేశంలో అంబేద్కర్ పాత్రపై వ్యాసరచన పోటీలు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించారు. ఈ పోటీలకు వివిధ పాఠశాలల నుంచి 40మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత


ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

మద్దిరాల : మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ అల్లి రవి ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బుధవారం మండల కేంద్రానికి చెందిన పలువురితో పాటు యూనియన్ సభ్యులు మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు.

ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

తుంగతుర్తి : మండలంలో నేడు నిర్వహించే జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని స్థానిక తహసీల్దార్ యాదగిరిరెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు ఎంతో కీలకమైందని, అర్హత కలిగిన ప్రతిఒక్కరూ ఓటుహక్కును కలిగి ఉండాలన్నారు. జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట డీటీ హరిశ్చంద్రప్రసాద్, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

సూర్యాపేట : సూర్యాపేట మున్సిపాలిటీలో చేపట్టిన పలు అభివృద్ధి పనుల్లో జరిగిన అవినీతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, అవినీతికి కారకులైన కాంట్రాక్టర్లు, అధికారులు, గతంలో అధికారంలో ఉన్న పార్టీ నాయకులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ ఎంఎల్ (ప్రజాపంథా) పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. 2014 నుంచి 2023 ఎన్నికల వరకు మున్సిపాలిటీలో జరిగిన ప్రతీపనిని కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డికి, అతడి అనుచరులకు మాత్రమే అప్పగించారని, ఈ పనుల్లో భారీగా అవినీతి అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు ఎనిమిదేళ్లుగా కొనసాగిస్తూనే ఉన్నారని, కోట్లాది రూపాయల నిధులు వెచ్చిస్తున్నా అభివృద్ధి మాత్రం జరగడం లేదన్నారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్‌కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా రాంజీ, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ, జిల్లా ఉపాధ్యక్షురాలు సూరం రేణుక, కోశాధికారి జయమ్మ, పార్టీ డివిజన్ నాయకులు వీరబోయిన రమేష్, ఎస్కే సయ్యద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీఓ 55ను రద్దు చేయాలని ఆందోళన

సూర్యాపేటటౌన్ : వ్యవసాయ, హార్టికల్చర్ యూనివర్సిటీల్లో 100ఎకరాల భూమిని నూతన హైకోర్టు నిర్మాణానికి కేటాయిస్తూ విడుదల చేసిన జీఓ 55ను తక్షణమే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనియాకుల శ్రీకాంత్‌వర్మ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుధవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. వ్యవసాయ, హార్టికల్చర్ యూనివర్సిటీల్లోని భూములను హైకోర్టు నిర్మాణానికి కేటాయించడం ద్వారా యూనివర్సిటీలో జీవ వైవిధ్యం దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ కళాశాల భూములను ప్రభుత్వం లాగేసుకుంటే భవిష్యత్‌లో వ్యవసాయ, హార్టికల్చర్ విద్యార్థులు పరిశోధనలు ఎక్కడ చేయాలని ప్రశ్నించారు. అరెస్టయిన వారిలో సంఘం నాయకులు బానోత్ వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అవిశ్వాసంపై సమాధానం చెప్పాలని ధర్నా

భానుపురి (సూర్యాపేట) : సూర్యాపేట మున్సిపల్ చైర్మన్ అన్నపూర్ణపై అవిశ్వాస తీర్మానం ఎందుకు పెట్టారో కౌన్సిలర్లు సమాధానం చెప్పాలని మాల మహానాడు జిల్లా మహిళా అధ్యక్షురాలు పిట్టల భాగ్యమ్మ డిమాండ్ చేశారు. దళిత మహిళా చైర్‌పర్సన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మాలమహానాడు మహిళా విభాగం, మహిళా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో చైర్మన్ బరిలో ఉన్న 31వ వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిలదిలీప్‌రెడ్డి నివాసం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాలుగేళ్ల పాటు ఎలాంటి అవినీతికి తావులేకుండా చైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించిందని, ఇందుకు గాను జాతీయ స్థాయిలో అవార్డులు సైతం వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో దళిత మహిళ నాయకురాలు బొడ్డు రజిని, జయమ్మ, షేక్ భానుశ్రీ, బొలెద్దు విజయ, వాంకుడోత్ నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిలర్ ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న మహిళలు

ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసుకోవాలి

సూర్యాపేట రూరల్ : ప్రభుత్వం అందిస్తున్న నిధులతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2024–25వార్షిక ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామ పంచాయతీలను ప్రభుత్వం అందిస్తున్న నిధులతో అభివృద్ధి చేయాలన్నారు. గ్రామపంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్‌పై టీమ్‌లలో ప్రతి గ్రామ పంచాయతీని ఎంపిక చేసినట్లు, ఎంపిక చేసిన గ్రామ పంచాయతీలను మండల సర్వసభ్య సమావేశంలో ఆమోదించామన్నారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి శిరీష, జెడ్పీటీసీ జీడి భిక్షం, ఎంపీడీఓ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాసనాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి

వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్రం

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు, వ్యవసాయ కూలీలపై వ్యతిరేక విధానాలు అవలంబిస్తుందని, ఆ విధానాలపై వ్యతిరేకంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని సీఐటీ యూ కార్యాలయంలో నిర్వహించిన వివిధ కార్మిక సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. 26న జిల్లా వ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ బంద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు. కార్పొరేట్, మతోన్మాద విధానాలను వెనుకకు కొట్టేందుకు కార్మిక వర్గం, రైతులు వ్యవసాయ కార్మికులు వివిధ రూపాల్లో ఐక్య కార్యాచరణ వేదికగా పోరాటాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ చెరుకు యాకలక్ష్మి, ఎం.శేఖర్, పందిరి సత్యనారాయణరెడ్డి, ఆటో యూనియన్ల నాయకుడు మురళి, ఎరుకల వెంకన్న, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

26న ట్రాక్టర్, బైక్ ర్యాలీ

నాగారం : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 26న కిసాన్ సంయుక్త మోర్చా ఆధ్వర్యంలో సూర్యాపేటలో నిర్వహించే ట్రాక్టర్, బైక్ ర్యాలీని జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ డివిజన్ కార్యదర్శి సంపేట కాశయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన అఖిల భారత రైతు కూలీ సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో ఏఐకేఎంఎస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, లింగయ్య, సోమన్న, కృష్ణమూర్తి, సతీష్, గణేష్ పాల్గొన్నారు.


దురాజ్‌పల్లి (సూర్యాపేట) : సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

అర్వపల్లి : సూర్యాపేటలో ఈనెల 26న జరిగే రైతు సంఘాల ట్రాక్టర్స్, బైక్ ర్యాలీలను విజయవంతం చేయాలని రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మూరగుండ్ల లక్ష్మయ్య కోరారు. బుధవారం అర్వపల్లిలో జరిగిన వామపక్ష పార్టీల రైతు సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో వజ్జ శ్రీను, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, వెంకన్న, నర్సయ్య, యాదగిరి పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

తిరుమలగిరి (తుంగతుర్తి) : విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే మందుల సామేల్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించా రు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థినులందరికీ నాణ్య మైన విద్య, పౌష్టికాహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పిల్లలందరికీ ప్రతి నెలా వైద్య పరీక్షలు చేయించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాలకు రావడానికి రహదారి సరిగా లేదని, సమస్య పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, జెడ్పీటీసీ దూపటి అంజలి, వైస్ ఎంపీపీ బొడ్డు సుజాత, వెలిశాల ఎంపీటీసీ సమత పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

ఆత్మకూర్ (ఎస్) : మండల వ్యాప్తంగా జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఏనుబాముల, నెమ్మికల్లు, కస్తూర్బిబా పాఠశాలల్లో విద్యార్థినులకు పలు అంశాలపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ డి.ధారాసింగ్ మాట్లాడుతూ.. అంతర్జాతీయ బాలికా దినోత్సవం బాలికల హక్కులు సమాజానికి తెలియజేయడానికి నిర్వహిస్తారన్నారు. నేటికీ సమాజంలో బాలికలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు జరగడం సిగ్గుచేటన్నా రు. ఆడపిల్లలకు చిన్నతనంలో వివాహాలు చేయడంతో వారు మానసికంగా, శారీరకంగా ఎదగక అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎంవీ ఫౌండేషన్ క్లస్టర్ ఆర్గనైజర్ నాయిని సైదులు, వత్సవాయి లలిత, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.


ఆత్మకూర్ (ఎస్) : కస్తూరిబా పాఠశాలలో బాలికాదినోత్సవ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని హెచ్‌ఎం డి.శంకర్‌నాయక్ అన్నారు. గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన మండల స్థాయి గణిత పోటీల్లో మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని శ్రీజ ప్రథమ బహుమతి గెలుచుకుంది. దీంతో శ్రీజకు పాఠశాల గణిత ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్‌రెడ్డి బుధవారం రూ.వెయ్యి బహుమతిగా అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు దుర్గాప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్, సుదర్శన్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నప్రాసన

నూతనకల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించిన సామూహిక అన్నప్రాసన, అక్షరభ్యాసం కార్యక్రమంలో సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఆడపిల్లలను పుట్టనిద్దాం–బతకనిద్దాం అనే నినాదంతో ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


తిరుమలగిరి (తుంగతుర్తి) : కస్తూరిబా పాఠశాలలో ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న విద్యార్థులు


ఆత్మకూర్ (ఎస్) : విద్యార్థినికి నగదు అందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు


నూతనకల్ : అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సర్పంచ్ తీగల కరుణశ్రీ

‘చలో ఢిల్లీ’ని విజయవంతం చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం – 2020 ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం సూర్యాపేటలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అడ్డూ అదుపు లేని విద్యా వ్యాపారీకరణ, విద్యా ప్రైవేటీకరణ, విద్యా కార్పొరేటీకరణను ప్రధాని మోదీ ప్రభుత్వం చేస్తుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఇచ్చే స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్, ఎయిడెడ్ కాలేజీలకు, పాఠశాలకు ప్రభుత్వ నిధులను నిలిపివేశారని అన్నారు. విద్యారంగంలో అమలు జరుగుతున్న ఈ పాసిస్ట్ దాడులకు అడ్డుకట్టలు వేయడానికి ఫిబ్రవరి 1నుంచి 3వతేదీలో న్యూఢిల్లీలో నిరసన ర్యాలీ, 3న జంతర్ మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సంఘం జిల్లా నాయకులు పుల్లూరి సింహాద్రి, పిడమర్తి భరత్, రహీం, సంపత్, వేణు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

అర్వపల్లి :కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ రామారావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని కోడూరు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్పయాత్ర వాహనంపై ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్‌పై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలు, ఆయుష్మాన్ భారత్, ఉజ్వల యోజన, ఆరోగ్యశ్రీ తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బొమ్మడి శ్రీనివాస్, అక్కిరెడ్డి యాదగిరి, ఏఎస్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశకార్యకర్తలు, బ్యాంక్ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఇందిరా కోరారు. బుధవారం మండల పరిధిలోని వెంకెపల్లి, చిల్పకుంట్ల, లింగంపల్లి, మాచనపల్లి గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రజలకు అందుబాటులో ఉండే పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు కొంపెల్లి రాంరెడ్డి, గోరుగంటి ఉషారాంకిషన్‌రావు, మాతంగి సోమనర్సమ్మ, ఎంపీఓ శశికళ, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లి : సంక్షేమ పథకాల క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు, స్థానికులు

గ్రామీణ యువత క్రీడల్లో రాణించాలి

నాగారం : గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ అన్నారు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఇటీవల మండల పరిధిలోని ఈటూరులో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రజా గాయకుడు ఏపూరి సోమన్న, ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్, టెక్నో డీడ్ ఐటీ కంపెనీ చైర్మన్ వంగూరి దామోదర్, సర్పంచ్ పేరాల సరితయాదగిరి, పేరాల సోమయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, గంగి భిక్షం, గంగి అవిలయ్య, పేరాల యాదగిరి, సుధాకర్, బొట్టు సురేష్, యల బాబు, సందీప్, గణేష్, ఎల్లయ్య, నాగార్జున, మహేష్, కిరణ్, అనిల్, నరేష్, రాజేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న చల్లా తేజ

రైతు బంధు నిధులు విడుదల చేయాలి

ఆత్మకూర్ (ఎస్) : అధికారంలోకి రాగానే రైతులకు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం నేటికీ రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని, వెంటనే విడుదల చేయాలని రైతు సమన్వయ సమితి మండల నాయకుడు కానాల మల్లారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం నిధులు విడుదల చేసి సమస్యలను పరిష్కరించాలన్నారు. రైతు బంధు నిధులు అడిగిన వారిపై మంత్రి కోమటిరెడ్డి దుర్భాషలాడడం రైతులను అవమానించడమేనని అన్నారు.

పట్టభద్రులు ఓటు నమోదు చేసుకోవాలి

నూతనకల్ : అర్హులైన పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు కోరారు. బుధవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో ఓటు కలిగి ఉన్న పట్టభద్రులు కూడా కొత్తగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు ఓటు నమోదు దరఖాస్తు పూర్తి చేసి డిగ్రీ మెమో ఒరిజనల్, జిరాక్స్‌తో నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

నాగారం : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని మోడల్‌స్కూల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బుధవారం విద్యార్థులకు క్రీడలు నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, రన్నింగ్, మ్యూజిక్‌చైర్, బుక్‌బ్యాలెన్స్ తదితర పోటీలు నిర్వహించారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నడిగూడెం : మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రణబోతు గణేష్‌రెడ్డి, షాహిద్ అలీలు జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆ విద్యార్థులను పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు యలమర్తి శౌరి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమావతి, ప్రకాష్‌రెడ్డి, కె.వేణుగోపాలరావు, అక్షపతి, షాకీర్ మీర్జా, నర్సింహారెడ్డి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.